

# వాల్ పోస్టర్

తల్లావజ్ఝుల పతంజలిశాస్త్రి

గడ్డం మీద ఇంకా బొగ్గుమరకలు వుండిపోయాయి. ఓ కంటి కొసన పుసులు వదల్లేదు. అరుగుమీద సగం పుచ్చిన చెక్కస్తంభానికి వీపు ఆనించి కూచున్నాడు మదారవలీ. సత్తుగిన్నెలోంచి గాజుగ్లాసులోకి టీ వడబోసింది బీ.

మోకాళ్ల మీద ఒంగి గ్లాసు తీసుకున్నాడు వలీ. పీటమీద కూచుని టీ తాగుతూ తమ్ముడికేసే చూస్తోంది బీ. మదారవలీకి పదకొండేళ్లుంటాయి. బీ వాడి కంటే ఏడెనిమిదేళ్లు పెద్దది. ఎక్కణ్ణించో కాకి కోడిగుడ్డు డొల్ల తీసుకొచ్చి దొడ్లో పడేసింది. ఉదయం ఎనిమిది దాటిపోయింది. టీ చప్పరిస్తూ వలీ అడిగేడు.

"నానెళ్లేడా!"

తమ్ముణ్ణే చూస్తున్న బీ తొట్రుపడి అంది.

"ఏమో నిషా దిగింది ఎళ్లేడు. జేబులో ఇరవై దొరికేయి."

"రాత్రి లేటయిందా? నానొచ్చి పండుకున్నాడు."

ఆఖరిగుక్క టీ తాగి గ్లాసు గిన్నెలో పడేస్తూ చెప్పింది బీ, "రమణమ్మ సిన్మాకి పోదావంది, పోయినా."

తమ్ముడేవీ అనలేదు. గ్లాసు అక్క కందించి కాళ్లు బారచాపి కూచున్నాడు. అరుగుమూల చీపురు తీసుకుని లోపలికి వెళ్లింది బీ.

ఊరి మధ్య బస్తీ అది. నగరాన్ని ఓ పక్క చీలుస్తూ సూటిగా పోయే రహదారికి ఒకవేపు సినిమాహాలు, ఒకపక్క అసంఖ్యాకంగా వెలిసిన షాపు గూళ్ల మధ్య నుంచి ఓ సన్నరోడ్డు చీలి ఫర్లాంగు దూరం సాగి పల్లంలో ఆగిపోతుంది. రోడ్డు ఆగిన చోటు నుంచి బస్తీ మొదలైంది. చివికిపోయిన ఇటుక మేడలు, ఎముకలు వెళ్లుకొస్తున్న పెంకుటిళ్లు, గుడిశలూ, బస్తీ అంతా చిక్కుపడ్డ నల్లదారం వుండలా వుంటుంది.

లోపలికి వెళ్లడం కంటే బయటకి రావడం కష్టం. ఇళ్లను వేరుచేస్తూ కాలవలున్నాయో, రోడ్లు కాలవలై పోయాయో చెప్పడం కష్టం. గాలి వీచినప్పుడల్లా ఇళ్లను ఆవరించివున్న దట్టమైన దుర్గంధం పొగలా చెదిరి వ్యాపిస్తూంటూంది. వర్షాకాలంలో బస్తీ అంతా మోకాళ్ల లోతు నీళ్లలో కరుగుతూ వుంటుంది. మదారవలీ ఇల్లు బస్తీ మొదట్లో వుంది. తెల్ల ఎరువుల బస్తాలు కలిసి కుట్టిన పరదా పెంకుటింటి ద్వారం ముందు వేలాడుతోంది. ముందు చిన్న పంచ, లోపల రెండు గదులూ, వెనక సన్నటి అరుగూ, నాలుగు బంగీల మేర పెరడూ, పెరట్లో ఓపక్క ఇటుకగోడల పాయిఖానా, ఓ పక్క తాటాకుల స్నానాల గదీ, రెండింటికీ కప్పుల్లేవు. అరుగు మీద బారుగా నాలుగు ప్లాస్టిక్ బాల్చీలలో, ఓ సత్తు బిందెలో నీళ్లు తెచ్చి పోసింది బీ, ఉదయమే.

చీపురు తీసుకుని అరుగు మీదికి వచ్చింది బీ. మొండి చీపురు చరచర శబ్దం చేస్తోంది.

"పనికిబోవా? మొకం కడగరాదూ సరిగా?"

ఒంగి తుడుస్తున్న అక్కను చూశాడు వలీ. పాత జాకెట్టూ పరికిణీలో వుందామె. చామనచాయ, సన్నగా, పెద్ద జుట్టుతో కొంచెం పెద్ద పెదాలు. బీ అంత అందమైంది కాదు. చిత్తడి నేలలో, ఏ విత్తనమో తెలీని ఏపుగా పెరిగిన మొక్కలాంటిదామె. దానికి ప్రత్యేకమైన పరిమళం లేదు. దారిద్ర్యాన్నీ, దైన్యాన్నీ నిశ్శబ్దంగా ధిక్కరించే వక్షస్థలం బీలో కనిపించే ఒకే ఒక జీవలక్షణం. ఒంగి తుడుస్తున్న ఆమెనే చూస్తున్నాడు వలీ. సమా

ధానం రాకపోయేసరికి తల ఎత్తి తమ్ముడి వేపు చూసిం దామె. వాడు కళ్లు తిప్పుకున్నాడు. పక్కకి తిరిగి చిమ్మడం ప్రారంభించింది బీ.

"కొట్టేడు బోసడికే."

"నువ్వేం జేశావ్?"

"ఏమ్జేయలే."

"సర్లే ఎళ్లు."

ఒక క్షణం అలాగే కూచుని లేచాడు వలీ. చీపురు అరుగుమూల పడేసి టీ గిన్నెలు తీస్తూ అంది బీ.

"రేపు నీకు కొత్త జుబ్బా, తెస్తా."

మదారవలీ నవ్వేడు. నల్లగా బక్క పలచగా వుంటాడు వలీ. పల్చటి పెదాలు ఓ పక్కకి సాగి వాడు నవ్వితే బుగ్గ మీద చిన్నసొట్ట పడుతుంది. వాడు నవ్వితే చూడ్డం బీకి ఇష్టం.

"ఎల్లు, పో."

అరుగు మీంచి గెంతి, డబ్బాతో నీళ్లు తీసుకొని పాయిఖానా వేపు నడిచాడు వలీ. గిన్నెలు తోమడం మొదలుపెట్టింది బీ. ('ఈడు అన్నం బెడతాడో, ఇంట్లోంచి బాడకో పొమ్మంటాడో'). వలీ మెయిన్ రోడ్డు మీద కరీం హోటల్లో క్లీనరు. రాత్రి కరీం లెంప వాయిం చాడు. ('మూడు కప్పులు పగలేసావ్. పైసా నువు కడతావా, మీ యక్కని పంపిస్తావురా') వలీ రెండు బూతులు గొణిగేడు. అవి జనాంతికం అయిపోయేయి. వాడికి అక్కంటే చాలా ఇష్టం. వలీ ఎనిమిదో ఏట తల్లి రైలు కింద పడింది. తల్లి రైలు పట్టాల వరకూ ఎందుకు వెళ్లిందో, గేట్లోంచి వెళ్లకుండా పట్టా కడ్డంగా దాటడం ఎందుకో వలీకి అర్థంకాలేదు. భార్య పోయినందుకు సంతాపసూచకంగా ఖాదరు వారంరోజులు తాగేడు. తర్వాత రోజూ సాయంత్రం ఇంటికి తాగొచ్చేవాడు. ఖాదరు ఏం చేస్తుంటాడో ఎవరికీ తెలీదు. అయితే కనీసం రెండ్రోజులకోసారేనా ఇంటికొస్తూంటాడు. తాగిన నిద్రలో వుండగా బీ అతని జేబులో డబ్బు తీస్తుం టుంది. వలీకి తండ్రి అంటే అసహ్యం. వాడికి కరీంని చూస్తే ఖాదరూ, ఖాదర్ని చూస్తే కరీం జ్ఞాపకం వస్తారు.

వాడింకా రాత్రుళ్లు అక్క పక్కనే పడుకుంటాడు. నిద్ర మెలకువ వచ్చినప్పుడల్లా బీ గుండెల మీద చెయ్యి వేసి పడుకుంటాడు. తరచుగా వాడికి బీకి దగ్గరిగా జరిగినప్పుడల్లా ఉక్కలో ఒకటి రెండు క్షణాలు ఏదో అగరొత్తుల పరిమళం వస్తుంది.

బీ గబగబ వంటచేసి స్నానం చేసింది. భుజానికి సంచీ తగిలించుకుని బయటపడింది. బీ రమణమ్మ దగ్గర కుట్టుపని చేస్తుంది. ఓ అరడజను పైగా అమ్మా యిలు ఆమె దగ్గర పని చేస్తుంటారు. కన్నూ ముక్కు తీరుగా వున్న అమ్మాయిలెవరేనా చిక్కుల్లో వుంటే రమణమ్మ మనసు చివుక్కుమంటుంది. మార్గం చూపి స్తుంది. బుగ్గన నిత్యం నలిగే తాంబూలంతో, రిక్షా అంతా సరిపడే మధ్య భాగంతో, ఆ ప్రాంతంలో ఎవరూ రమణమ్మ కుట్టుపని చెయ్యగా చూడలేదు.

వలీ హోటలు గుమ్మం దగ్గిర నుంచున్నాడు. సిగరెట్టి వెలిగించి అగ్గిపుల్ల పారెయ్యబోతూ చూశాడు కరీం. అతనివేపే చూస్తున్నాడు వలీ.

"ఏం గావాల్రా?"

"డూటీ కొచ్చే."

"డూటీ కొచ్చేవా! ఎవ్డ్రమ్మన్నాడంట చల్ బే," తలొంచుకుని నుంచున్నాడు వలీ.

"డూటీలో జేరతా."

వాడివేపు దీర్ఘంగా చూసి చెప్పేడు కరీం

"రేపు రా పో! ఈణ్ణించి పో! ఇంటికాడెవరు న్నారు?"

"దేనికి."

"పనుందిరా."

"ఎవరూలేరు. అక్క కుట్టుమిషను కాడికి బోయింది." మళ్లీ రోడ్డుమీద కొచ్చేడు వలీ. జేబులో రెండు రూపాయిలున్నాయి. రోడ్డు దాటి సినిమాహాలు దగ్గర బండిలో ఇడ్లీ తిని, టీ తాగి బీడి వెలిగించి నుంచు న్నాడు మదారవలీ. రోడ్డుమీద రద్దీ ఎక్కువైంది. బస్సు ల్లోంచి వెళ్లకొస్తున్నారు మనుషులు. అప్పుడు చూశాడు వలీ. పేవుమెంటు పక్కనుంచే వెళుతోంది టైరుబండి. దానిపక్కనే నలుగురు మనుషులు పలుగూ పారలతో నడుస్తున్నారు. బండి మీద బోర్లా పెద్ద రేకులతో చేసిన హోర్డింగ్. బండీ, మనుషులూ- శవయాత్రలా అనిపిం చింది.

"అగ్గీ."

తేరుకుని చూశాడు వలీ. నలుగురు కూలీల్లో ఒకడు నోట్లో సిగరెట్టు పెట్టుకుని ఎదురుగా నుంచు న్నాడు. దమ్ములాగి బీడి ఇచ్చాడు వలీ. ఆఖరి దమ్ము లాగి బీడి అవతల పారేసి బండి వెనుక నడిచాడు. సినిమాహాలు దాటిన తరువాత కొంత దూరంలో ఖాళీ స్థలం వుంది. ఏదో ప్రభుత్వ కార్యాలయం బోర్డు, ప్రహరీగోడ తప్ప అక్కడేవీ లేదు. బండి గోడవారగా ఆగింది. గోడని ఆనుకుని ముగ్గుతో గుర్తులు పెట్టి వున్నాయి. నలుగురూ మాట్లాడుకుని గుర్తులు పెట్టిన చోట తవ్వడం ప్రారంభించారు. లోతుగా రెండు గుంటలు తవ్వి పలుగు, పారా పక్కన పడేసి బీడీలు

వెలిగించారు వాళ్లు. గుంటల్లోంచి మట్టి తీసిన చేతుల్నిండా తడి మట్టి అతుక్కుపోయింది. తీరిగ్గా బీడీలు కాల్చి, బండిని గుంటల దగ్గరగా జరిపి రేకు చట్రాన్ని కిందికి దించి నిలబెట్టేరు. వలీ దగ్గరిగా వచ్చి చూశాడు. బండి, మనుషులు అడ్డు వుండడంతో సరిగా ఏవీ కనిపించడం లేదు. రేకు చట్రాన్ని గుంటలో దింపడానికి సర్వీకాళ్లు బిగించి వున్నాయి. నలుగురూ ప్రాణప్రదంగా ఎత్తి, కేకల మధ్య బూతుల మధ్య నవ్వుల మధ్య దాన్ని పాతి నిలబెట్టేరు.

హోర్డింగ్ ఎదురుగా వచ్చి నిలుచున్నాడు మదార వలీ. వాడితోపాటు మరో ఇద్దరు కుర్రాళ్లు. ఓ రిక్షావాడు దాన్నే చూస్తున్నారు. రేకు కొత్త రంగులు ఎండలో తళతళ మెరుస్తున్నాయి. దీర్ఘ చతురస్రాకారంతో చక్కటి లేత రంగులు వేసింది. ఎదురుగా నుంచుని రెండు చేతులూ వెనక్కి కట్టుకుని తల పైకెత్తి ఈసారి వలీ జాగ్రత్తగా చూశాడు. ఇరవై నిముషాలు తదేకంగా చూసింతర్వాత హోర్డింగ్ వాడి మెదడులో మొలిచింది. మెడ నొప్పి పుట్టింది. వెనక్కి చూస్తూ సినిమాహాలు వేపు నడిచాడు వలీ. చుట్టూరా మోగే కారు హారన్లూ, మోటార్ల శబ్దాలూ లీలగా వినపడుతున్నాయి వలీకి. హాలు దగ్గర ఆగి కిళ్లీకొట్లో మరో రెండు బీడీలు కొన్నాడు.

రెండో బీడీ వెలిగించగానే వాడికి బీని చూడాలనిపించింది. రమణమ్మ ఇంటివైపు నడిచాడు వలీ. నడుస్తున్నా వాడి మనసులో విచిత్రమైన స్తబ్ధత ఏర్పడింది. ఆ స్తబ్ధతతో రంగు రంగుల హోర్డింగ్ బరువుగా ఇమిడిపోయింది. వాణ్ణి తేరిపార చూసి బీని బయటికి పని మీద పంపించానంది రమణమ్మ. ఆమె ఎర్రటి నోటివేపు ఓసారి కోపంగా చూసి మళ్లీ రోడ్డు మీదికి వచ్చేడు వలీ. వాడికి అక్కని వెంటనే చూడాలని వుంది.

మధ్యాహ్నం వరకూ రోడ్లమీద తిరిగి ఇంటికెళ్లేడు వలీ. భోంచేస్తూ పనిలోకి వెళ్లలేదని చెప్పేడు.

“నే జెప్తాలే,” అంది బీ. వలీకి ఎందుకో అక్కని మొదటిసారి చూస్తున్నట్టుగా వుంది. మంచం ఎక్కి పండుకోగానె నిద్ర పట్టేసింది.

సాయంత్రం అయిదు దాటింది. టీ తాగి మొహం కడుక్కుని బయటికి వెళ్లిపోయాడు వలీ. రోడ్డు దాటి సినిమాహాలు దగ్గర బీడీ వెలిగించి అప్రయత్నంగా హోర్డింగ్ దగ్గరకెళ్లి నుంచున్నాడు. లేత రంగుల్లో అందంగా వేసిన తాజ్‌మహల్ టైల్స్ ఫేక్టరీ హోర్డింగ్ అది. (‘ఇంట్లో తాజ్ చల్లదనం. మీ చుట్టూ తాజ్ సౌందర్యం.’) పెద్ద హాలు. హాలు నిండా రంగుల్లో పరిచిన టైల్సు, కిటికీలోంచి తోటలో చెట్ల పచ్చటి తలలు కనిపిస్తున్నాయి. సినిమాల్లో కూడా వలీ అటువంటి ఇల్లు చూడలేదు. గది మధ్యలో చల్లటి నేల మీద పడుకుని వుందామె. బోర్లా పడుకుని, ఎత్తిన రెండు కాళ్లనూ వెనక్కు మడమల దగ్గర పెనవేసింది. మోచేతుల మీద ముఖం అనించి, విశాలమైన కళ్లు ఎత్తి చూస్తోందామె. అనిమేషలా, గంధర్వకాంతలా ఆమెకీ ప్రపంచం తాలూకు దుమ్మూ, ధూళీ, పెట్రోలు వాసనలూ సోకడంలేదు. ఆమె ఎదురుగా ఎవరో కుర్చీలో కూర్చున్నారు. మనిషి పూర్తిగా కనిపించడు. ఖరీదైన పేంటు. కాళ్లు రెండూ మిలమిల మెరిసే నల్లటి బూట్లతో ఒకదాని మీద ఒకటి వేసుక్కూచున్నాడు అతను. ఆమె ఒంటి మీద సముద్రం నీలం చీరలాంటి దుప్పటీ వేసుకుంది. చీర నడుంపై భాగం తరవాత సరిపోలేదు.

నల్లటి అలలా లేచి పరుచుకున్న ఆమె జుత్తు భుజాల మీంచి వీపు మీదకి ప్రవహిస్తోంది. భుజాల క్రింద నున్నటి ఒంపుని చూస్తూ వుండిపోయాడు వలీ.

వలీ చుట్టూ చీకటిపడింది. రోడ్డు మీద దీపాలు వెలిగేయి. కార్ల కళ్లు వెలిగాయి. వలీ రోడ్డు దాటి అవతలకి వెళ్లేడు. హోటలు రద్దీగా వుంది. బిల్లులు వసూలు చెయ్యడంలో హడావుడిగా వున్నాడు కరీం. రేకు టేబిలు మీంచి కప్పులూ, ప్లేట్లూ, బాల్చీలోకి వేసుకుంటూ లోపల్నించి నారాయణ నవ్వేడు. చెయ్యి ఊపి, రేపొస్తానని సంజ్ఞ చేసి, మరోసారి కరీం వేపు చూసి బయల్దేరాడు వలీ. కరీంది బట్టతల. నోట్లో రోజులో చాలా భాగం సిగరెట్టు తగలడుతూ వుంటుంది. చిన్ని కళ్లకి సుర్మా పెట్టుకుంటాడు. చప్పి దవడల నిండా సూదులు గుచ్చినట్టు సన్నటిచిల్లులు. నోట్లో సిగరెట్ తీసినప్పుడల్లా క్లీనర్లని ఓ బూతుతో కేకెయ్యడం కరీం అలవాటు. ఖాదరు మొహం కూడా సన్న చిల్లులమయం. వలీకి అప్పుడప్పుడు కరీం, ఖాదరు రైలు కింద పడి చచ్చిపోయినట్టు కలొస్తూంటుంది. ఒకసారి బీతో చెప్తే వాడి తలని పొట్టకి అదుముకుంటూ అరగంట నవ్వింది.

పేవ్‌మెంట్ మీది ఇనప రైలింగ్ మీద కూచున్నాడు వలీ. బాగా చీకటి పడిపోయింది. ఇంటికెళ్లే సందు చీకటి కాలవలా వుంది. తరచుగా జనం వెళ్లి సందు గోడవేపు నుంచుని వస్తున్నారు. వలీ మనసులో ఇదివరకు లేని చైతన్యంలాటిదేదో కదలడం మొదలైంది. మళ్లీ బీ జ్ఞాపకం వచ్చింది. అక్క జ్ఞాపకం రాగానే వాడికి చాలా సంతోషం అనిపించింది.

"ఇంటికి రావా, ఈడ కూచున్నావు?"

ఉలిక్కిపడ్డాడు వలీ. బీ పక్కనే నుంచుని వుంది. ఆమె చేతి ప్లాస్టిక్ బుట్టలో ఉల్లిపాయలున్నాయి. వలీ నవ్వేడు. ఇద్దరూ చీకటి సందులోకి నడిచారు. ముక్కుకి చెయ్యి అడ్డు పెట్టుకుంది బీ.

గది మూల కోడిగుడ్డు దీపం తగ్గించి వుంది. గోడ మీద నీడల్లా రెండు బల్లులు వుండుండి కదుల్తున్నాయి. తెరిచిన కిటికీలోంచి గాలి రావడం లేదు, తరచుగా వాసన తప్ప. ఇద్దరికీ విసురుతూ బీ ఎప్పుడో నిద్రపోయింది. వలీ బోర్లా పడుకుని ఓ చెయ్యి అక్క నడుం చుట్టూ వేసి పడుకున్నాడు.

తోట రాత్రి పడ్డ వర్షానికి మెత్తగా తడిసింది. ఉదయపు ఎండలో మరీ పచ్చగా వుండి, చెట్లు కమ్మగా నిట్టూరుస్తున్నాయి. కిటికీ పక్కనే విరగపూసిన పూలు బీ గుండెలనిండా పరిమళాలు నింపుతున్నాయి. తలారా స్నానం చేసి, ఆరడానికి ఎర్రటర్కీ టవలు చుట్టుకుందామె. లేత నీలం చీరలో బీ నీరసంగా, అందంగా వుంది. టీపాయి మీద వెండి ప్లేట్లో పరాఠాలు పూల వాసనలతో కలిసి పరిమళిస్తున్నాయి. బయట కారు హారన్ మోగించి బీ వాచీ చూసుకుంటుండగా లోపలికొచ్చేడు వలీ. కంగారుగా వచ్చి కుర్చీలో కూచున్నాడు. బీ వెండిగిన్నెలో కమ్మటి మాంసం కూరలో ముంచి పరాఠా ముక్క తమ్ముడి నోటి కందించింది. పసుపు పచ్చరంగు చొక్కా వలీ ఒంటి రంగులో కలిసిపోయింది. పట్టులాంటి జుట్టు గాలికి కలవరపడుతూ మొహం మీద పడుతుంటే మధ్య మధ్య బీ జుత్తు వెనక్కి తోస్తుంది.

మెట్ల మీద నుంచొని బీ బుగ్గ మీద మెత్తగా ముద్దు పెట్టుకుంది. చెయ్యి ఊపి కార్లో వెనక సీట్లో కూరుకుపోయాడు వలీ. పెద్ద పడవలా తెల్లటి కారు రోడ్డు నదిలోకి జారిపోయింది. నలుగురు మనుషులు శవాన్ని మోసుకుపోతూ అద్దంలోంచి కనిపించారు. కారు వాళ్లని దాటుతుండగా అగరొత్తుల వాసన కిటికీలోంచి వచ్చిపడింది.

"ఎవరు?"

"టీ స్టాలు కరీం బాబూ," అన్నాడు డ్రైవరు.

ఒళ్లో తల పెట్టుకుని జుట్టులో బంగారు వేళ్లు కదుపుతూ నిద్రపుచ్చింది బీ. వలీ నిద్ర నీలిమలోకి జారిపోయాడు. తమ్ముడి తల మెల్లగా ఒళ్లోంచి తెల్లటి దిండు సువాసనల్లోకి జార్చి భర్త దగ్గరకి వెళ్లిపోయింది బీ. కదిలి దిండు ముఖం మీదకి లాక్కున్నాడు వలీ.

"ప్చ్," అంటూ.

చటుక్కున లేచింది బీ. చెమటతో తడిసిన ఆమె పొట్టలోకి వలీ మొహం కూరుకుపోయింది. జుట్టు ముడేసుకుంటూ లేచి కూచుందామె.

"ఎదవా."

వెల్లకిలా పడుకుని బద్ధకంగా బీ వేపు చూశాడు వలీ. లేచి కూచుని అక్కవేపు చూసి నవ్వేడు.

వలీ ఉదయమే పనిలో చేరేడు. వీలైనప్పుడల్లా కరీంవేపు చూస్తున్నాడు. వాడిలో విచిత్రమైన ఉత్సాహం కడుపు నిండుగా వుంది. బిర్యానీ తిన్నట్టు మధ్యాహ్నం అన్నం తింటూ పెద్దగా నవ్వేడు. వాడిని అలా నవ్వుతూ చూడ్డం నారాయణకి మొదటిసారి. టేబిలు దగ్గర్నించి అరిచాడు కరీం.

"ఏరా బావమర్దీ నవుతూండావే."

సాయంత్రం నారాయణా, వలీ టీ తాగి, బీడీలు వెలిగించి 'తాజ్‌మహల్' దగ్గరికొచ్చేరు. దానివేపే చూస్తూ నుంచున్నాడు వలీ. తోటలోంచి చల్లటి గాలి తగిలింది వాడికి.

"మా ఇల్లే," అన్నాడు వలీ.

వలీ వేపు ఒకసారి చూసి పెద్దగా నవ్వేడు నారాయణ.

తరువాత వారంరోజులూ వలీ బొంగరంలా పని చేశాడు. కరీంని చూసినకొద్దీ కరీం శవం గుర్తొచ్చి హాయిగా వుంది వాడికి. రోజూ రాత్రి బీ విసుక్కుంటున్నా బీ దగ్గరగా జరిగి పడుకుంటున్నాడు వలీ. ఉక్కా, చెమట, కిటికీ ధారపోసే వాసనలూ వాణ్ణి బాధించడం మానేశాయి. నిద్రలోకి జారే ముందు కళ్లు మూసుకుని రోజుకో చల్లటి కల కనడం అలవాటైంది వాడికి. వలీ ఆలోచనలెప్పుడూ కరీం చుట్టూ తిరుగుతూండేవి. తరచుగా కరీం వాణ్ణి చావబాదినట్టు కలొస్తూండేది. వేరే కలలు కనడానికి వలీకి ఎప్పుడూ అవకాశం కలగలేదు. ఎప్పుడేనా సినిమాలు చూసినా కరీం మీద కల్లో పగ తీర్చుకోవడానికి మాత్రం సరిపోయేవి.

ఇప్పుడు ఒకరోజు రాత్రి ఖాదరు వాడి తోటమాలి. మరోరోజు కరీం ఒంటి కాలితో డాల్డా డబ్బాతో కార్లో కూచున్న వలీని, రోడ్డు మీద వాళ్లనీ అడుక్కుంటూంటాడు. ఓరోజు తెల్ల పెద్ద కారులో వాడూ నారాయణా సినిమా కెళ్లేరు. రోజూ ముఖ్యంగా అక్క ఒళ్లో మెత్తని పరుపు మీద నిద్ర. వలీ చుట్టూ 'తాజ్‌మహల్ సౌందర్యం, చల్లదనం' కమ్ముకున్నాయి. పగలు ప్లేట్లూ, కప్పులూ కడగడం తియ్యడం ఇబ్బందిగా లేదు. పగలు

అవాస్తవంగా రాత్రి వాస్తవంగా వాడి పదకొండేళ్ల జీవితం అస్తవ్యస్తంగా  ఓ కొత్త కక్ష్యలో తిరగడం ప్రారంభించింది. బీ రోజు రోజుకీ అందంగా కనిపిస్తోంది వాడికి.

మరో పదిరోజుల తరవాత ఓ రోజు మధ్యాహ్నం కరీం బజారుకని సంచి తీసుకుని వెళ్లిపోయాడు. కరీం వెళ్లిన అరగంటకి ఇప్పుడే వస్తానని చెప్పి బయటపడ్డాడు వలీ. వాడికివాళ సాయంత్రం నారాయణతో సినిమా కెళ్లాలని వుంది. బీడీ కాల్చి, అప్రయత్నంగా ఇంటివేపు తిరిగేడు వలీ. సందులో ముగ్గురు పక్కపక్కనే గోడవేపు తిరిగున్నారు. సందు దిగుతున్న వలీ కాళ్లు తడిశాయి (‘ఎదవ కొడుకులు’).

ఇంటి తలుపు వేసి వుంది. రెండు మెట్లు ఎక్కి బీని పిలవబోయి ఆగిపోయాడు. నిద్రపోతుంటే అక్కని లేపడం వాడికిష్టంలేదు. కానీ బీ మధ్యాహ్నం రమణమ్మ దగ్గర వుంటుంది. మళ్లీ అరుగెక్కి కిటికీ తలుపు చిల్లు లోంచి లోపలికి చూశాడు వలీ. గది అవతలి తలుపు ఒకటి తీసే వుంది. పలచని చీకట్లో వుంది గది. మంచం మీద పడుకుని వుంది బీ. లోపలి చీకటికి వలీ కళ్లు అలవాటు పడ్డాయి. వాడి గుండె రెంచిలో పెట్టి నొక్కి నట్టయింది. బీ పక్కనే మోచేతి మీద ఆని మరో వ్యక్తి పడుకున్నాడు. అతని రెండో చెయ్యి యథాలాపంగా బీ నడుం మీద వుంది. అతని కాలు ఆమె కాలి మీద వేసి వుంది. వలీ చూస్తుండగానే మంచం మీంచి లేచి తాడు మీద లుంగీ చుట్టుకుని నుంచున్నాడు కరీం. ఇప్పుడు బీ నగ్న శరీరం స్పష్టంగా కనిపించింది వలీకి.

మెట్లు దిగి హోటలుకి వెళ్లిపోయాడు వలీ. కడుపు మీంచి కారు వెళ్లినట్టుంది వలీకి. వెనకాల తొట్టి దగ్గర కప్పులు కడుగుతూ మూడు కప్పులు పగలకొట్టి కాలవలోంచి బయటకి తోశాడు. కప్పులు కడుగుతూ మోకాళ్ల మధ్య తల పెట్టుకుని ఏడిచాడు వలీ. సాయంత్రం నారాయణకి చెప్పకుండా వెళ్లిపోయాడు. బస్సులూ, కార్లూ, లారీలూ అన్నీ వాడి మీదకి వస్తున్నట్టే వుంది. కరీంని వాడికి వచ్చిన బూతులన్నీ తిట్టాడు. రాత్రి పదిగంటల వరకూ తిరిగి ఇంటికెళ్లాడు వలీ. బీ తిట్టినా అన్నం తినకుండా, కింద చాపేసుకుని పడుకున్నాడు. రాత్రి వాడు చచ్చిపోయినట్టూ కరీం నవ్వుతున్నట్టూ కలొచ్చింది. రెండోరోజు అర్ధరాత్రి మెలకువ వచ్చింది బీకి. చాప మీద పడుకుని నిద్రలో ఏడుస్తున్నాడు వలీ. తమ్ముడికి ఏవైందో అర్థంకావడం లేదామెకి. వలీకి రాత్రిళ్లు వాడికే అర్థంకాని చీకటి కలలొస్తున్నాయి. అక్కవేపు చూడ్డానికి భయంగా వుంది వాడికి. సిల్కు, పట్టుబట్టల్లోంచి, పాలరాతి ఇంట్లోంచి బయటపడి బీ ఇప్పుడు వలీ కళ్లకి మురికి పాతల్తో ఇబ్బందిగా, కొత్తగా కనిపిస్తోంది.

సాయంత్రం బీడీ వెలిగించి సినిమా హాలు దగ్గర నుంచున్నాడు వలీ. హంసలాంటి పెద్ద తెల్లకారు ఆగింది. అందులోంచి నడివయసు తెల్లటి వ్యక్తి, ఆయన ఇద్దరూ పిల్లలూ దిగేరు. ఆమె వయసు బీ అంత వుంటుంది. కుంకుమా బంగారం కలిపిన రంగు లో వుందామె. నేలమీద మోపిన ఆమె పాదాలు ఏవో ఎర్రపువ్వుల్లా వున్నాయి. తమ్ముడి భుజం మీద చెయ్యి వేసి లోపలికి వెళ్లిపోయిందామె. కారు కదిలిపోయింది.

బీడీ అవతల పారేశాడు వలీ. కారు రోడ్డు ప్రవాహంలో కొట్టుకుపోయింది. అప్రయత్నంగా హాలు దాటి ‘తాజ్‌మహలు’ వేపు నడిచాడు. లైట్లు వెలిగేయి. హోర్డింగ్ ఎదురుగా నుంచున్నాడు వలీ. తెల్లరంగు వేసి వున్న చట్రం మీద పెద్ద రెండు నల్లటి × గుర్తులూ, ఓ పక్కగా పేడ ముద్దవేసి వున్నాయి.

*ఆంధ్రజ్యోతి వారపత్రిక, 5 ఏప్రిల్ 1991*

